**209 వ అధ్యాయం**

# ٢٠٩ - بَابُ اسْتِحْبَابِ رَكْعَتَيْنِ بَعْدَ الْوُضُوءِ

# వుజూ తర్వాత రెండు రకాతులు చేయటం అభిలషణీయం

١١٤٧ - عن أبي هُرَيرَةَ رَضِيَ اللهُ عَنـهُ أَنَّ رَسُـولَ اللهِ ﷺ قـالَ لِبِـلالٍ: «يَابِلالُ! حَدِّثْنِي بِأَرْجَى عَمَلٍ عَمِلْتَهُ في الإِسْلَامِ، فَإِنِّي سَمِعْتُ دَفَّ نَعْلَيْكَ بَيْنَ يَدَيَّ فِي الجَنَّةِ»، قالَ: مَا عَمِلْتُ عَمَلاً أَرْجَى عِنْدِي مِنْ أَنِّي لَم أَتَطَهَّرْ طُهُوراً في سَاعَةٍ مِنْ لَيْلٍ أَوْ نَهارٍ إِلَّا صَلَّيْتُ بِذلكَ الطُّهُورِ ما كُتِبَ لِي أَنْ أُصَلِّيَ. متفقٌ عليه. وهـذا لفـظ البخـاري. «الـدَّفُّ» بـالفـاءِ: صَـوْتُ النَّعْـلِ وَحَـرَكَتُـهُ عَلـى الأَرضِ، والله أعلم.

1147. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సల్లం) బిలాల్‌ను ఉద్దేశ్యించి "బిలాల్! నేను స్వర్గంలో నా ముందర నీ చెప్పుల సవ్వడి విన్నాను. (ఏమిటి విశేషం?) ఇస్లాం స్వీకరించిన తర్వాత నువ్వు చేసిన అత్యంత ఆశావహ ఆచరణ ఏమిటో కాస్త నాక్కూడా చెబుతావా?" అని అడిగారు.

దానికి సమాధానమిస్తూ హజ్రత్ బిలాల్ (రజి), "(దైవప్రవక్తా!) నేను రేయింబవళ్ళలో, ఎప్పుడు వుజూ (లేక గుసుల్) చేసినా ఆ తర్వాత (వెంటనే) నా అదృష్టంలో వ్రాసి ఉన్నన్ని రకాతుల నమాజ్ తప్పకుండా చేస్తాను. ఇంత కన్నా గొప్ప ఆశావహ ఆచరణ ఏదీ నా దృష్టిలో లేదు" అని చెప్పారు. (బుఖారీ-ముస్లిం, వాక్యాలు మాత్రం బుఖారీలోనివి.)

*(సహీహ్ బుఖారీలోని తహజ్జుద్ ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రవక్త సహచరుల మహిమోన్నతుల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

హదీసు మూలంలో '**తుహూర్**' అనే పదం వాడబడింది. తుహూర్ అంటే శుద్ధి అని

అర్థం. వుజూ, గుసుల్, తయమ్ముమ్-ఈ మూడింటి ద్వారా షరీఅత్ ఆశించే శుద్ధి ప్రాప్తిస్తుంది. కనుక ఈ మూడింటిని తుహూర్‌గానే పరిగణించటం జరుగుతుంది. మొత్తానికి హజ్రత్ బిలాల్ రేయింబవళ్ళలో ఎప్పుడు వుజూ లేక గుసుల్ చేసినా ఆ తర్వాత వెంటనే కొన్ని రకాతులు నఫిల్ నమాజు తప్పకుండా చేసేవారు. మరికొన్ని ఉల్లేఖనాల ద్వారా ఆయన రెండు రకాతులు చేసేవారని తెలుస్తున్నది. ఆయన చేసిన పనిని దేవుడు మెచ్చుకొని ఆయనకు ఇంతటి ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. ఆయన గొప్పదనాన్ని దైవప్రవక్త (సల్లం) కూడా తమ కళ్ళారా వీక్షించారు.

దైవప్రవక్త (సల్లం)కు ఈ దర్శనం మేరాజ్ (గగన యాత్ర) సందర్భంలో కలిగి ఉండవచ్చు లేదా తనపై మగత ఆవరించినప్పుడు ఆయన ఈ విషయాన్ని తిలకించి ఉండవచ్చు. ఏది ఏమైనా దీని ద్వారా తహియ్యతుల్ వుజూ (వుజూ తర్వాత చేసే) నమాజు ప్రాముఖ్యత వెల్లడౌ తోంది. కొంతమంది పండితులు ఈ హదీసు విస్తృత భావాన్ని దృష్టిలో పెట్టుకొని తహియ్యతుల్ వుజూ, తహియ్యతుల్ మస్జిద్ నమాజులు, 'అవ్‌ఖాతె మక్రూహ్' (నమాజు అయిష్టకరమైన వేళ)ల్లో కూడా చేయవచ్చని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు దైవప్రవక్త(సల్లం) ఫజ్ర్ మరియు అస్ర్ తర్వాత నఫిల్ నమాజులు చేయకూడదని వారించినట్లు తెలుపుతున్న హదీసుల్ని దృష్టిలో పెట్టుకొని మరికొంతమంది పండితులు, ఈ నమాజు 'అవ్‌ఖాతె మక్రూహ్'లో చేయకూడదని తలపోస్తున్నారు. ఆధారాల దృష్ట్యా ఇరువురి అభిప్రాయాలూ సరైనవే. కనుక ఎవరయినా నమాజు అయిష్టకరమయ్యే వేళ మస్జిద్‌లోకి ప్రవేశించి రెండు రకాతుల తహియ్యతుల్ మస్జిద్ లేక తహియ్యతుల్ వుజూ నమాజు చేసుకుంటే అతన్ని తప్పుపట్టడంలో అర్థం లేదు.